

# మహాభారతం

## విమర్శలు - విధానాలు 3

రచన:
మహాభారత పరిశోధకులు
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc., (Ag)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్ : 08647 254716.

(గత సంచిక తరువాయి)

మహాభారతంపైన, మహాభారత గ్రంథకర్త వ్యాస మహర్షిపైన, మహాభారతంలోని విభిన్న పాత్రలపైన, అనేక సంఘటనలపైన కొందరు వ్యక్తులు అనేరకాల విమర్శలు చేస్తూ అపోహలు, అపార్థాలు సృష్టించారు. వాటికి తోడు అనేక సినిమాలు కూడా తోడైనవి. పెద్దలను అగౌరవ పరచడం, మహాత్ములను దూషించడం, సద్గ్రంథాలను నిరసించటం, మంచిని చెడుగాను, చెడును మంచిగాను చూపేందుకు ప్రయత్నించడం, అవునన్నదాన్ని కాదనటం, కాదన్నదాన్ని అవుననటం, ధర్మాత్ములను అధర్మపరులుగాను- అధర్మపరులను ధర్మాత్ములుగాను ప్రకటించటం, ధర్మాన్ని అధర్మంగాను- అధర్మాన్ని ధర్మంగాను నిరూపించడం కొరకు గ్రంథంలో లేని ఏవేవో విషయాలను కల్పించి చెప్పటం ద్వారాగాని, లేదా ఉన్న విషయాలను వ్యత్యస్తం చేసి తప్పుగా వ్యాఖ్యానించటం ద్వారా గాని చేయవలసినంత సారస్వత ద్రోహం చేశారు, చేస్తున్నారు.

ఏదైనా ఒక గ్రంథాన్ని, లేదా అందలి పాత్రలను విమర్శించేటప్పుడు ఆ గ్రంథాన్ని ఆధారం చేసుకొనే విమర్శించాలి. మహాభారతంలో వ్యాసుడు అలా వ్రాయటం తప్పు; ఆ సంఘటన అలా జరిగి ఉండదు-ఇలా జరిగి ఉంటుంది; ఇక్కడ వ్యాసుడు జరగని దానిని జరిగినట్లు వ్రాశాడు; అసలు జరిగిందొకటి- వ్యాసుడు వ్రాసింది మరొకటి; ఫలానా వారిపై పక్షపాతబుద్ధితో వ్రాశాడు; మంచివాళ్ళను చెడ్డవాళ్ళుగా-చెడ్డవాళ్ళను మంచివాళ్ళుగా చిత్రించాడు అని అనటానికి మనమెవరం? మహాభారత గాథ జరిగిన సమయంలో ఈ విమర్శించే వారుగాని, దీనిని చెప్పేవారుగాని, వినేవారుగాని ఎవరైనా ఉండి స్వయంగా చూచి వచ్చారా? లేక ఆనాటి పాత్రలలో ఎవరైనా వచ్చి మనకు చెబుతున్నారా? లేదే. కనుక ఏమి జరిగిందో, ఎలా జరిగిందో ఆనాడు మొదటినుండి చివరిదాకా మహాభారతంలో పాత్రధారిగా కూడా ఉన్న వ్యాసమహర్షి వ్రాసినదే మనకు ఆధారం. ఆ ఆధారమే లక్షశ్లోకాల మహాభారత ఇతిహాసగ్రంథం. కనుక ఎవరైనా సరే ఆ గ్రంథాన్ని బట్టే విమర్శలు చేయాలి, ధర్మమేదో- అధర్మమేదో, మంచి ఏదో-చెడు ఏదో గ్రహించాలి తప్ప ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు కథను గాని, పాత్రల స్వభా వాలనుగాని మార్చకూడదు. మహర్షులు లోక కళ్యాణకాంక్షతో ప్రసాదించిన ఆర్షగ్రంథాలను అస్తవ్యస్తం చేయబూనటం వల్ల అట్టి వారిని కొందరు అమాయకులు మేధావులుగా ప్రశంసించవచ్చు, సన్మానాలు చేయవచ్చు, బిరుదులివ్వవచ్చు. దానివల్ల వారు తాత్కాలికంగా ఆనందాన్ని పొందవచ్చునేమోగాని, అది మహర్షులకు, వారు ప్రసాదించిన గ్రంథాలకు తీరని ద్రోహంచేసినట్లు; తద్వారా మానవజాతి కంతటికీ ద్రోహం చేసినట్లు; చివరకు తనకు తానే ద్రోహం చేసుకున్నట్లు.

ఎందుకంటే ఈ విమర్శల గోలలో, ఈ తర్కవితర్కాలలో ఈ గ్రంథాల ద్వారా మానవుడు ఏమి గ్రహించాలో, ఏ ఆశయ సిద్ధికొరకు మహర్షులు ఈ గ్రంథాలను ప్రసాదించారో- అనే విషయం మరుగున పడిపోతున్నది. వేదాలుగాని, ఉపనిషత్తులుగాని, ఉపనిషత్‌సారమైన భగవద్గీతగాని, రామాయణ మహాభారత ఇతిహాసాలుగాని- అన్నీ లోక కళ్యాణం కొరకు; మానవుడు తన లౌకిక జీవితాన్ని ధర్మబద్ధంగా, అత్యున్నతంగా తీర్చి

దిద్దుకొని, మానవ జీవిత పరమలక్ష్యమైన మోక్షమార్గాన పయనించి, తమ తమ జీవితాలను సార్థకం చేసుకొనేందుకే మహర్షులు వీటిని మానవజాతికి ప్రసాదించారు. అందులోనూ మహాభారతం అనేకపాత్రలద్వారా మానవుడు ఎలా నడుచుకోవాలో, ఎలా నడుచుకోకూడదో చక్కగా తెలియజేస్తున్నది. అట్టిస్థితిలో పాండవులు అధర్మపరులని, దుర్యోధనాది దుష్ట చతుష్టయం ధర్మాత్ములని, న్యాయవర్తనులనీ కీర్తించటం ద్వారా దుర్యోధనాదులలాగా నడుచుకోండి, పాండవులలాగా నడుచుకోవద్దు అని చెప్పటమే ఈ విమర్శకుల ఉద్దేశమా?

## మన కర్తవ్యం ఏమిటి?

ధర్మాన్ని ఆచరించటం వల్ల అర్థకామాలేకాదు మోక్షం కూడా సిద్ధిస్తుందని మహాభారతాన్ని శౌనకాదులకు వినిపించిన సూత మహర్షి తెలియజేశాడు. ఇది తెలిస్తే మానవుడికి ధర్మాచరణపట్ల ఆసక్తి కలుగుతుంది. ఆసక్తి కలిగితే ధర్మమంటే ఏమిటో-అధర్మమంటే ఏమిటో తెలుసుకోవాలనుకుంటాడు. అలా తెలుసుకోవాలంటే శాస్త్రగ్రంథాలను, ఇతిహాసాలను నిశితంగా పరిశీలన చేస్తూ, అందలి పాత్రల స్వభావాలను ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకోవాలి, లోతుగా అధ్యయనం చేయాలి, పెద్దల, గురువుల సలహా తీసుకోవాలి. ధర్మం సూక్ష్మమైనది. గహనమైనది, గనుక సూక్ష్మబుద్ధితో గ్రహించాలి. అప్పుడే అధర్మాన్ని వదలి ధర్మాన్ని ఆచరించగలుగుతాం.

ఆర్ష సాంప్రదాయ గ్రంథాలు మన నవలల లాగా, కథల లాగా లేదా న్యూస్‌పేపర్‌లాగా చదివి తెలుసుకోగలిగినవి కావు. ఈనాటి న్యూస్ పేపర్ రేపటికి వేస్ట్‌పేపర్. ఈనాటి గొప్ప నవల గురించి సంవత్సరం తర్వాత చెప్పుకొనే వాడుండడు. కాని ఈ గ్రంథాలు వేల, లక్షల సంవత్సరాలనుండి, యుగ యుగాలనుండి జీవించే ఉన్నాయి. జీవించే ఉంటాయి. రామాయణ, మహాభారతాలలోని పాత్రలు అన్ని దేశాలలో, అన్నికాలాలలో సజీవంగా కనిపిస్తూనే ఉంటాయి. కనుక ఈ గ్రంథాలను మన సంకుచిత దృష్టితో చూడరాదు. మరి ఎలా చూడాలి?

ఆర్ష సాంప్రదాయ గ్రంథాలలో మంత్ర శక్తులు అణిమాది అష్టసిద్ధులు, తపస్సు యొక్క మహిమ, శాపానుగ్రహ సామర్థ్యాలు, దేవతా సాక్షాత్కారాలు, పాతివ్రత్య మహిమలు, వర ప్రభావాలు, దివ్యదృష్టులు, త్రికాల జ్ఞానాలు మొదలైన అనితర సాధ్యమైన, అసాధారణ విషయాలెన్నో శాస్త్రసిద్ధమై ఉంటాయి. కనుకనే ఈ గ్రంథాలను విమర్శించేటప్పుడు ఈ ఆర్ష సాంప్రదాయ దృష్టి ఉండాలి. లేనిచో అది సద్విమర్శ కాబోదు. భారతీయులకు ఐహిక, ఆముష్మిక శ్రేయస్సులను కలిగించటానికి సాధనాలై, జీవిత సర్వస్వాలైన ఈ మహా గ్రంథాలను అసంగతమైన విమర్శలనుండి కాపాడి, గ్రంథ విషయాలను ఉన్నవి ఉన్నట్లుగ అందించటం ఆర్ష విద్యా గ్రంథములయందభిమానము, లోక కళ్యాణ కాంక్షగల భారతీయుల పవిత్ర కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చాలనే నా యీ సంకల్పం భగవంతుని అనుగ్రహంతో నెరవేరుగాక! అలాగే పాఠకులు కూడా చక్కగా అధ్యయనం చేసి సూక్ష్మబుద్ధితో గ్రహించెదరుగాక!

మహాభారతాన్ని కురుపాండవుల కథగా గాక, మన కథగా-మానవ జీవిత కథగా చూడాలి. అలా చూడాలంటే మనం గ్రంథంలోకి పరకాయ ప్రవేశం చేయాలి. ఇప్పుడలా గ్రంథంలోకి ప్రవేశిస్తూ, ఈ గ్రంథాన్ని లోకానికి ప్రసాదించిన వ్యాసమహర్షి యొక్క జన్మ వృత్తాంతం ఏమిటో, ఆయన జన్మగాథ వెనుకగల ఆధ్యాత్మిక రహస్యం ఏమిటో, ఆయనపై విమర్శకుల అవాకులు చవాకులు ఏమిటో, వాటికి సమాధానం ఏమిటో, ఆయన మహిమ, అనన్య సామాన్యమైన ప్రతిభ ఎట్టిదో క్రమంగా తెలుసుకుందాం.

## వ్యాసమహర్షి జన్మ వృత్తాంతం

(ఆదిపర్వం - 63వ అధ్యాయం)

చేది దేశాన్ని ఉపరిచరవసు మహారాజు ధర్మబద్ధంగా పాలిస్తున్నాడు. అతడికి 'గిరిక' అనే భార్య ఉన్నది. ఒకనాడు ఋతుస్నాత అయిన గిరిక సంతానాపేక్షతో భర్తను సమీపించింది. అయితే అదే సమయంలో ఉపరిచరవసువు తల్లిదండ్రులు 'వేటకు వెళ్ళి క్రూరమృగాలను సంహరించవలసినదిగా' కుమారుని ఆజ్ఞాపించారు.

వారి ఆజ్ఞను శిరసావహించి వేటకై అరణ్యమునకు వెళ్ళాడు. అది వసంతకాలం. పుష్పాలతో, ఫలాలతో కూడిన వృక్షములతో ఆ వనమంతా అత్యంత రమణీయంగా ఉన్నది. చల్లని గాలులు సుగంధ సువాసనలతో మనోహరంగా వీస్తున్నాయి. వాతావరణం అంతా ఆహ్లాదంగా ఉంది. ఒక రమణీయ అశోక వృక్షం నీడన సేదదీరుతున్న వసురాజుకు ఆ ఆహ్లాదకర వాతావరణంలో భార్య గిరిక గుర్తుకు వచ్చింది. మదన పీడితుడైన రాజుకు వీర్యస్ఖలనమైంది. అది వ్యర్థం కాకుండా దానినొక ఆకుదొన్నెలో పట్టి, పుత్రోత్పత్తి కారకమగునట్లు అభిమంత్రించి, తన రథ సమీపంలోనే ఉన్న ఒక శీఘ్రగామియైన డేగను చూచి, దానిని డేగ కాలికి కట్టి, తన భార్యకు ఇమ్మని చెప్పాడు.

ఆ డేగ వాయువేగంతో వెళుతుండగా, ఎదురుగా మరొక డేగ దానిని మాంసఖండమని భావించి దీనిపై పడగా, ఆ రెండు డేగల పోరాటంలో వసురాజు వీర్యం క్రిందనున్న యమునా నదిలో పడిపోయింది. 'అద్రిక' అనే అప్సరస బ్రహ్మదేవుని శాపంవల్ల చేపరూపంలో ఆ నదిలో ఉంటున్నది. అది ఈ వీర్యాన్ని మ్రింగి గర్భం ధరించింది. పదియవ మాసంలో దానిని జాలరులు వలవేసి పట్టి కడుపుకోసి చూడగా ఒక బాలుడు, బాలిక ఉన్నారు. ఆశ్చర్యపోయిన జాలరులు ఆ శిశువులిద్దరిని మహారాజుకు అప్పగించగా, అందు మగశిశువును రాజు గ్రహించి, ఆడశిశువు చేపల వాసన కలిగి ఉండటాన దాశ రాజుకు పెంచుకోమని ఇచ్చాడు. ఆమెయే సత్యవతి. రూప లావణ్యములు కలిగియున్నప్పటికీ శరీరం నుండి చేప వాసన రావటం వల్ల 'మత్స్యగంధి' అనే పేరుతో పిలువబడుతున్నది. (శ్లో 39-67)

## వ్యాస జననం

పెంచిన తండ్రి దాశరాజు ఆనతితో సత్యవతి యమునా నదిపై నావ నడుపుతున్నది. తీర్థయాత్రలు చేస్తూ పరాశర మహర్షి ఒకనాడు, యమునానది దాటుటకు నావనెక్కి నావ నడుపుతున్న సత్యవతిని చూశాడు. ఆమె రూపలావణ్యాలకు ఆకర్షితుడై మహర్షి, ఆమెతో సంగమించాలనే కోర్కెను వెలిబుచ్చాడు. అది విని సత్యవతి 'భగవాన్! చుట్టూ ఋషులు చూస్తున్నారు గదా!' యనగా మహర్షి మాయాతిమిరాన్ని సృష్టించాడు. అప్పుడు సత్యవతి భయంతో 'మహర్షీ! మీతో కలయికవల్ల నా కన్యాత్వం దూషితమవుతుందిగదా! నేనెలా తిరిగి ఇంటికి వెళ్ళగలను?' అనగా పరాశరుడు 'నీ కన్యాత్వం దూషితం కాదు. నీవు కన్యగానే ఉంటావు. నీకేదైనా వరం ప్రసాదిస్తాను కోరుకో' అన్నాడు. 'ఈ శరీరం నుండి మత్స్యవాసన పోవాల'ని కోరగా, మహర్షి అనుగ్రహించి, 'భామినీ! ఇకనుండి నీ శరీరం నుండి వెలువడే సుగంధం యోజనం దూరం వరకు వ్యాపిస్తుంది' అని వరమిచ్చాడు. అప్పటినుండి ఆమెకు గంధవతి అని, యోజనగంధి అనే పేర్లు వచ్చినవి.

అంతట పరాశరుడు సత్యవతితో కలియగా సద్యోగర్భంలో అప్పటికప్పుడే శిశువు జన్మించాడు. అతడే వ్యాసుడు. అతడు జన్మించగానే తల్లితో "అమ్మా అవసరమైనప్పుడు నన్ను స్మరించు. నేను ఆ క్షణమే నీ ఎదుట ఉంటాను" అని చెప్పి తల్లి అనుమతితో తపస్సుకై వెళ్ళాడు. అతడు బాల్యంలోనే యమునా ద్వీపంలో విడువబడటం వల్ల ద్వైపాయనుడు అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు. (శ్లో 68-86)

ఇదీ సత్యవతీ పరాశరులకు వ్యాసుడు జన్మించిన విధం. ఇది ఈనాటి వారికి తప్పుగాను, అసహ్యాకరమైనదిగాను కనిపిస్తుంది. పరాశరమహర్షి వంటి గొప్ప వ్యక్తి చేపల కంపుకొట్టే అమ్మాయిని కామించటమేమిటి? అప్పటికప్పుడు ఆ పడవమీదే కలియటమేమిటి? ఆయన అంతటి కామాతురుడా? అని విమర్శ. తపోధనుల యొక్క తపశ్శక్తుల గురించి, శాపానుగ్రహాల సామర్థ్యం గురించి, వారి యొక్క త్రికాల జ్ఞానం గురించి ఆలోచించలేని సామాన్య మానవులకు, అల్పజ్ఞానులైన మానవులకు తప్పుగా తోచవచ్చు; కాని ఒక విషయం- నిజంగా అది అంతటి తప్పే అయితే, అసహ్యాకరమైనదే అయితే సాక్షాత్తు వ్యాసమహర్షియే తన జన్మగాథను స్వయంగా ఇలా ఎందుకు చెబుతాడు? అది అంతటి అసహ్యాకరమైనదే అయితే ఆ వ్యాస మహర్షిని మహాభారత గాథలోని అందరూ ఎందుకంతగా గౌరవించారు? ఆ పరాశరమహర్షిని గాని, సత్యవతిని గాని ఒక్కరు కూడా తప్పుపట్టలేదు? ఇదే మనం ఆలోచించాలి.

ఆయా యుగాలలోని మానవులు ఎలా ధర్మబద్ధంగా నడుచు కోవాలో తెలియజేసే ధర్మశాస్త్రాలను స్మృతులు అంటారు. అలాంటి స్మృతులను అందించిన మహాపురుషులలో మనువు (మనుస్మృతి), యాజ్ఞవల్క్యుడు (యాజ్ఞవల్క్యస్మృతి)తో బాటు పరాశరుడు (పరాశరస్మృతి) కూడా ఒకరు. అంతటి స్మృతి కర్త పరాశరుడు కామాతురుడు అనగలరా? మహాత్ముల చర్యలు లోక కళ్యాణ కారకాలేగాని అల్పమైన కామ్యకర్మలు కాదు. ఈ పరాశర సత్యవతీ కలయిక వల్ల జరిగిందేమిటి? పరమజ్ఞాన స్వరూపుడైన వేదవ్యాసుడు జన్మించాడు. వేద మంత్రాలను విభాగం చేసి నాల్గువేదాలను లోకంలో విస్తరింపజేసి, నాల్గు వేదాల సారంగా మహాభారతాన్ని రచించి, వేదార్థాన్ని సామా న్యులకు అందుబాటులోనికి తెచ్చి, లోక కళ్యాణం కావించిన మహాత్ముడు జన్మించటానికి కారణమయినది ఈ చర్య.

ఆనాటి మహాత్ముల చర్యలలోని దోషాలేమిటా? అని మన అల్పబుద్ధితో చూడటంగాక, ఆ మహాత్ముల యొక్క గొప్పతనం ఏమిటా? అని, ఆయా గాథల వెనుక దాగిన రహస్యాలేమిటా? అని, ఆయా గాథల నుండి మనం గ్రహించవలసినది ఏమిటా? అని లోతుగా అధ్యయనం చేసి చూడాలి. అలా చూసినప్పుడు ఈ వ్యాసమహర్షి జన్మ వృత్తాంతం వెనుక దాగి ఉన్న ఒక అద్భుత ఆధ్యాత్మిక రహస్యాన్ని తెలుసుకొని, ఆనాటి మహర్షుల యొక్క ఆలోచనా విధానం ఎలా ఉంటుందో గ్రహిద్దాం. ప్రత్యే కంగా వ్యాసమహర్షి యొక్క అసాధారణ విద్యా ప్రభావం, అనన్య సామాన్య ప్రజ్ఞా దురంధరత్వం ఎట్టిదో సూక్ష్మబుద్ధితో గ్రహిద్దాం.

## వ్యాస జననం

## అందలి ఆధ్యాత్మిక రహస్యం

**'సత్యవతి'**- అంటే సత్యం కోసం - పరమాత్మకోసం పరితపించే సాధకుడు - అని.

**'దాశరాజు'**- అంటే దశేంద్రియాలను స్వాధీనములో పెట్టుకోవటం- ఇంద్రియనిగ్రహం - అని.

**'యమునా నదిపై నావ నడపటం'**- అంటే యమునానది నీరు నలుపు. నలుపు తమోగుణానికి చిహ్నం. నావ నడపటం అంటే దాటటం; కనుక తమోగుణాన్ని అధిగమించటం- అని.

**'పరాశరుడు'**- పర అంటే పరమాత్మ, శరం అంటే బాణం. కనుక పరాశరుడు అంటే పరమాత్మనుండి విడువబడిన బాణం అని. అతడే భగవత్స్వరూపుడైన సద్గురువు.

**'నీతో సంగమించాలని చెప్పటం'**- అంటే సాధకుణ్ణి శిష్యుడుగా జేసుకొని సద్గురువు జ్ఞానబోధ చెయ్యాలనుకోవటం - అని.

**'చుట్టూ ఋషులు చూస్తున్నారు గదా!' అనటం** - అంటే చుట్టూ ఎన్నో విషయ వస్తువులు, ప్రాపంచిక భోగాలు భ్రమలు కల్పిస్తున్నాయి గదా! మోహపెడుతున్నాయిగదా!- అని.

**'మాయాతిమిరాన్ని సృష్టించటం'**- అంటే విషయ వస్తువులపై మోహాన్ని పోగొట్టేందుకు వైరాగ్యబోధ చెయ్యటం - అని.

**'కన్యాత్వం దూషితం అయితే తండ్రి వద్దకెలా వెళ్లగలను?'**- అంటే ఈ జ్ఞానబోధతో నా కర్తవ్యాన్ని విడిచిపెట్టాల్సివస్తే తండ్రివద్దకెలా వెళ్ళగలను? తండ్రి ఆనతిని ధిక్కరించినట్లు అవుతుందిగదా!- అని.

**'నీ కన్యాత్వం దూషితం కాదు'**- అంటే నీ కర్తవ్యాన్ని యధా విధిగా నెరవేర్చుకోవచ్చు- అని.

**'మత్స్యవాసన పోయి సుగంధ వాసన కలిగేట్లు అనుగ్రహించటం'**- అంటే గత జన్మలలో సంపాదించుకున్న దుర్వాసనల (అసద్ వాసనల)ను నశింపజేసి సద్ వాసనలు కలిగేట్లు అనుగ్రహించటం- అని.

**'పరాశరుడు సత్యవతితో కలియటం'**- అంటే సద్గురువు అన్ని అర్హతలు సంపాదించిన శిష్యునికి ఆత్మజ్ఞానాన్ని బోధించటం- అని.

**'సద్యోగర్భంలో అప్పటికప్పుడే వ్యాసుడు జన్మించటం'**- అంటే సద్గురువు జ్ఞానబోధ చేస్తూ చేస్తూ ఉండగానే శిష్యునిలో అప్పటికప్పుడే జ్ఞానం ఉద్భవించటం; వ్యాసుడే జ్ఞానం గనుక జ్ఞానం ఉద్భవించటం - అని.

**'ఎప్పుడు స్మరిస్తే అప్పుడు తక్షణమే నీ ఎదురుగా ఉంటాను అని తల్లికి వ్యాసుడు చెప్పటం'**- అంటే గురుబోధ ద్వారా లభించిన జ్ఞానం విని ఊరుకుంటే శిష్యునిలో నిలవదు. మళ్లీ మళ్ళీ మననం చేసుకుంటూ ఉంటేనే ఆ జ్ఞానం స్థిరంగా నిలుస్తుంది - అని. ఇప్పుడు మొత్తం కథను ఆధ్యాత్మికంగా మలుచుకొంటే ఇలా అర్థమవుతుంది.

పరమాత్మను అందుకోవాలని పరితపించే సాధకుడు ముందుగా ఇంద్రియ నిగ్రహాన్ని సాధించి తమోగుణాన్ని జయించాలి. అట్టి సాధకునికి భగవంతుడే సద్గురువు రూపంలో తటస్థపడతాడు, శిష్యునిగా చేసుకుంటానంటాడు. చుట్టూ విషయ వస్తువులు వ్యామోహపరుస్తున్నాయి గదా! అంటే సద్గురువు వైరాగ్యబోధతో ఆ వ్యామోహాన్ని పోగొట్టి; జ్ఞాన సంపాదనవల్ల కర్తవ్యాన్ని విడిచిపెట్టాల్సివస్తుందేమోనని సందేహించిన శిష్యునికి, నీ కర్తవ్యాన్ని యధాప్రకారం నెరవేర్చుకోవచ్చునని భరోసా ఇచ్చి, అప్పటివరకు శిష్యునిలో ఉన్న అసద్వాసనలను నశింపజేసి సద్వాసనలను నింపి; ఆత్మ జ్ఞానాన్ని బోధించాడు గురువు. దానితో అర్హతగల శిష్యునికి తక్షణమే ఆత్మజ్ఞానం కలిగింది. అయితే ఆ జ్ఞానాన్ని మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటూ ఉంటేనే ఆ జ్ఞానం అతడిలో స్థిర పడుతుంది. ఇదీ వ్యాస జననగాథ వెనుక దాగి ఉన్న ఆధ్యాత్మిక రహస్యం. ఈ ఆధ్యాత్మిక సత్యాన్ని కథారూపంలోచెప్పటం వ్యాస మహర్షి యొక్క అసాధారణ విద్యాప్రభావానికి, అనన్య సామాన్య మైన ప్రజ్ఞా దురంధరత్వానికి నిదర్శనం అని గ్రహించాలి.

**ఇట్టి మహామహితాత్ముడైన వ్యాసుడు నిషాదుడట. భారతాన్ని అన్యాయంగా వ్రాసినందుకు చింతించి భాగవతాన్ని రచించాడట. భాగవతాన్ని రచించినా మనస్సు శాంతించక, ప్రాయశ్చిత్తం కోసం మహాభారతం స్వర్గారోహణపర్వంలో దుర్యోధనునకు స్వర్గప్రాప్తిని, పాండవులకు నరకప్రాప్తిని చెప్పియున్నాడట. నిజమా.**

(వచ్చే సంచికలో)

**సాధన అనగా ఆశించిన వస్తువును అందుకునే నిమిత్తం పదే పదే ఆచరించే కర్మలు. ఆత్మను సన్నిహితం గావించుకునేదే నిజమైన సాధన. సత్య కర్మలు లేని సాధన నిరర్థకం. ఇట్టి నిత్య సత్య సంభూతమైన ఆత్మతత్వమును బయట ప్రపంచంలో వెతుకుతున్నాము. అదే అజ్ఞానం.**



# మహాభారతం 4

## వ్యాసునిపై విమర్శలు


రచన:
మహాభారత పరిశోధకులు
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc., (Ag).
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్ : 08647 254716.


(గత సంచిక తరువాయి)

**1) 'వ్యాసుడు నిషాదుడు-పారశవుడు'-విమర్శ**

"బ్రాహ్మణునకు శూద్రస్త్రీయందు పుట్టినవాడు నిషాదుడు లేక పారశవుడు అని మనుస్మృతిలో గలదు. వ్యాసుని తండ్రి బ్రహ్మర్షియగు పరాశరుడు, తల్లి దాశకన్య, కనుక వీరికి పుట్టిన వ్యాసుడు నిషాదుడు లేక పారశవుడై యుండెను" అని మహాభారత చరిత్ర అనే గ్రంథంలో పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు విమర్శించారు. దానిని ఆదర్శంగా తీసుకొని మరికొందరు అలాగే విమర్శించారు, ఈ విమర్శలో ఎంత నిజమున్నదో చూద్దాం.

ముందుగా మనుస్మృతిలో ఏమున్నదో చూద్దాం.

**శ్లో॥ బ్రాహ్మణాద్వైశ్య కన్యాయాం అంబష్ఠోనామ జాయతే।**
**నిషాదశ్శూద్ర కన్యాయాం యః పారవశ ఉచ్యతే॥** (మనుస్మృతి)

**తా॥** బ్రాహ్మణునకు వైశ్యకన్యవల్ల జన్మించిన వానిని అంబష్ఠుడని, బ్రాహ్మణునకు శూద్రకన్యవల్ల జన్మించిన వానిని నిషాదుడు లేదా పారశవుడని అంటారు.

దీనిని బట్టి బ్రాహ్మణునకు శూద్రకన్య వల్ల జన్మించిన వానిని నిషాదుడంటారు అని తేలింది. మరి వ్యాసుని తల్లి సత్యవతి శూద్రకన్యయా? ఆమె దాశరాజు చేత పెంచబడినదే గాని అతని పుత్రిక కాదు. ఆమె జన్మను గురించి గత సంచికలో తెలుసుకున్నాం. చేదిరాజు ఉపరిచరవసువు వీర్యమును డేగ తీసుకొని పోతుండగా అది యమునలో పడిపోయింది. అద్రికయను అప్సరస చేపరూపంలో ఉండి ఈ వసురాజు వీర్యాన్ని మ్రింగింది. దానితో అది గర్భం ధరించింది. 10 నెలల తరువాత జాలరులు దానిని పట్టి, పొట్టకోసి చూడ, అందు ఒక బాలుడు, బాలిక ఉండగా జాలరులు వారిద్దరినీ వసురాజుకు చూపి విషయము చెప్పగా మహారాజు బాలుణ్ణి గ్రహించి, బాలిక మత్స్య వాసనతో ఉండటం వల్ల ఆమెను పెంచుకొమ్మని దాశరాజునకిచ్చాడు, ఆమెయే సత్యవతి. దాశకన్యయని చెప్పబడిన వ్యాసుని తల్లి ఆమెయే. ఆమె వసురాజు వీర్యమున జన్మించినందువల్ల బీజ ప్రాధాన్యతను బట్టి క్షత్రియకాంతయే గాని శూద్రకాంత అనుటకు వీలులేదు. ఆమె శూద్రకాంత కానపుడు, ఆమెకు బ్రహ్మర్షి పరాశరుని వల్ల జన్మించిన వ్యాసుడు నిషాదుడెలా అవుతాడు? కాడు. కనుక వ్యాసుడు నిషాదుడనుట మనుస్మృతిని బట్టి కూడా చెల్లదు. వ్యాసుడు బీజప్రాధాన్యతను బట్టి బ్రాహ్మణుడే – అనేది సత్యం.

**2) 'వ్యాసుడు భారతమును అన్యాయముగా వ్రాసినాడు'-విమర్శ**

"న్యాయమును అన్యాయముగాను, అన్యాయమును న్యాయముగాను వ్రాయుట చేత వ్యాసుడే చింతించి, నారదుని ఉపదేశంతో భాగవతమును రచించెను" అని పై విమర్శకుడు మరొక ఆరోపణను చేయటం జరిగింది. ఇందులోని నిజమేమిటో చూద్దాం.

దుర్యోధనాదులది న్యాయమని; పాండవులది అన్యాయమని; కాని వ్యాసుడు మాత్రం అందుకు వ్యతిరేకంగా వ్రాశాడని ఈ విమర్శకుని ఉద్దేశం. దుర్యోధనాదులదే న్యాయము, పాండవులది అన్యాయము అని చెప్పటానికి ఈ విమర్శకుడు ఏ గ్రంథాన్ని ప్రమాణంగా తీసుకున్నాడు? మహాభారత గాథకు ప్రమాణ గ్రంథం వ్యాసునిచే చెప్పబడిన లక్ష శ్లోకాల మహా

భారతం తప్ప మరియొకటి ఈ ప్రపంచంలో లేదు. మరి మహాభారతమేమో దుర్యోధనాదులది అన్యాయమని, అక్రమమని, అధర్మమని, మోసమని, దుర్మార్గమని చెబుతున్నది. పాండవులది న్యాయమని, ధర్మమని స్పష్టంగా చెబుతున్నది.

ఇక ఏ ప్రమాణ గ్రంథాన్ని బట్టి కాదు, ఆయన స్వయంగా ఆ కురుపాండవులను చూచి చెబుతున్నాడందామా? 5000 సం॥ల క్రిందట వారిని చూచి ఇప్పటిదాకా బ్రతికి ఉండటం అసాధ్యం, అసంగతం. పోనీ ఆనాటి వారెవరైనా ఈయనకు చెప్పారు అందామా? అది కలలో సాధ్యమేమో గాని ఇలలో సాధ్యం కాదు. కనుక ఇలాంటి నిర్ణయానికి ఆయన రావటం దృష్టి దోషమూ, బుద్ధి దోషమూ తప్ప మరేం కాదు. ఆయన విమర్శ ఎంతవరకు నిలబడుతుందో చూద్దాం.

అన్యాయంగా భారతాన్ని వ్రాసినందుకు చింతించి, నారదుని ఉపదేశంతో భాగవతాన్ని వ్రాశాడని కనిపెట్టాడీ విమర్శకుడు. ఇదే నిజమైతే-

**1)** అలా చింతించి వ్రాసిన భాగవతంలో "నేను భారతాన్ని అన్యాయంగా వ్రాసినందుకు చింతించి ఈ భాగవతాన్ని వ్రాస్తున్నాను" అని చెప్పి ఉండాలి గదా! మరి భాగవతంలో అలా ఉన్నదా? లేదే, పైగా భాగవతంలో ఏమున్నదో చూడండి.

**శ్లో॥ కర్మశ్రేయసి మూఢానాం శ్రేయ ఏవం భవే దిహ,**
**ఇతి భారత మాఖ్యానం కృపయామునినాకృతం॥**

**తా॥** శ్రేయస్సుకు సాధనమైన కర్మమార్గంలో మూఢులైన వారికి కూడా శ్రేయస్సు కలగాలని, దయతో మహాభారతమును అనుగ్రహించెను-అని.

అంటే మహాభారతమును వ్రాసినందుకు చింతించలేదు సరిగదా! లోకానికి శ్రేయస్సును కలిగించాలనే అనుగ్రహ బుద్ధితో మహాభారతాన్ని రచించాడనియే భాగవతంలో చెప్పబడింది.

2) **న్యాయాన్ని** అన్యాయంగా; అన్యాయాన్ని న్యాయంగా మహాభారతంలో వ్రాసినందుకు చింతించి భాగవతాన్ని వ్రాసిన వ్యాసుడు మరి భాగవతంలోనైనా న్యాయాన్ని న్యాయంగా, అన్యాయాన్ని అన్యాయంగా వ్రాయాలి గదా! అంటే దుర్యోధనాదులు ధర్మాత్ములని, పాండవులు అధర్మపరులని, దుర్మార్గులని వ్రాయాలి గదా! మరి భాగవతంలో అలా ఉన్నదా? లేదే, భాగవతంలో కుంతీదేవి శ్రీకృష్ణునితో "కృష్ణా! కంసునిచే బాధించబడ్డ నీ తల్లి దేవకీదేవిని ఉద్ధరించటం కన్నా ఎక్కువగా, ఎన్నోసార్లు నన్ను, నా బిడ్డలను కష్టాలనుండి గట్టెక్కించావు. ఆనాడు భీమునకు విషాన్నం పెట్టినప్పుడు, లక్కయింటి ముప్పు నుండి, హిడింబాది రాక్షసుల నుండి రక్షించావు. ద్యూత సభలోను, అరణ్యాలలోను, యుద్ధంలో మహారథుల అస్త్ర జ్వాలల నుండి రక్షించావు" అన్నది. ఈ కుంతీదేవి మాటల వల్ల దుర్యోధనాదుల దుష్టకార్యాలు, దుర్మార్గాలు భాగవతంలో కూడా చెప్పబడి ఉన్నాయి. దీనినిబట్టి వ్యాసుడు భారతాన్ని అన్యాయంగా వ్రాయలేదని, అలా వ్రాసినందుకు చింతించలేదని తేలిపోయింది.

3) నిజంగా వ్యాసుడు భారతాన్ని అన్యాయంగా వ్రాసి, అలా వ్రాసినందుకే చింతించి ఉంటే నారదుడు వ్యాసుని మందలించి ఉండాలి. 'ఎందుకలా వ్యత్యస్తంగా వ్రాయడం, ఇపుడు చింతించటం?' అని. కాని నారదుడేమన్నాడో చూడండి, "వ్యాసమహర్షీ! సకల ధర్మాలను ప్రతిపాదిస్తూ, అందరికీ శ్రేయస్సు కలిగేటట్లు మహత్తరమైన, అద్భుతమైన మహాభారత గ్రంథాన్ని వ్రాయటం చేత నీ ఆశయం సిద్ధించింది. ఐనా నీవు ఏమీ సాధించనివానివలె చింతిస్తున్నావు. (తథాపి శోచస్యాత్మానం అకృతార్థ ఇవప్రభో!) నీవు మహాభారతంలో ధర్మార్థకామ మోక్షముల గురించి సంపూర్ణంగా వర్ణించావు. కాని భగవంతుని మహిమలను అంతగా వర్ణించలేదు. కనుక విష్ణుభగవానుని మహిమలను, భక్తుల యొక్క కథలను వర్ణిస్తూ భాగవత గ్రంథాన్ని రచించు" అన్నాడు నారదుడు. దీనిని బట్టి నారదుడు అన్యాయంగా భారతాన్ని వ్రాశావని మందలించలేదు సరిగదా, నీవు ఉత్తమము, మహత్తరము, ధర్మస్వరూపము, శ్రేయోదాకము ఐన గ్రంథమును వ్రాసితివని వ్యాసుని ప్రశంసించాడు.

దీనిని బట్టి వ్యాసుడు భారతాన్ని అన్యాయంగా వ్రాయలేదని; అన్యాయంగా వ్రాసితినని చింతించలేదని; అన్యాయంగా వ్రాసినందుకే భాగవతాన్ని వ్రాయలేదని; అన్యాయంగా వ్రాసితివని నారదుడు మందలించలేదని; పైగా అద్భుతమైన, శ్రేయోదాయకమైన, ధర్మస్వరూపమైన భారతాన్ని వ్రాసినందుకు ప్రశంసించాడని; భాగవతంలో కూడా భారతంలో లాగే దుర్యోధనాదులది అన్యాయమని, ధర్మజాదులదే న్యాయమని వ్యాసుడు వ్రాసినాడని తేలిపోయింది. కనుక ఈ వ్యత్యాసం వ్యాసుని బుద్ధిలో లేదని, అది విమర్శకుని బుద్ధిలోనే ఉన్నదని, ఇదంతా విమర్శకుని దృష్టి దోషమేనని గ్రహించాలి.

**3) "దుర్యోధన స్వర్గ, పాండవ నరక వృత్తాంతము"-విమర్శ**

"భాగవతమును రచించినప్పటికీ మనసు ఇంకా బాధించుటచేత, ప్రాయశ్చిత్తం కొరకు కాబోలు వ్యాసుడు మహాభారత స్వర్గారోహణ పర్వంలో దుర్యోధనునకు స్వర్గప్రాప్తిని,

పాండవులకు నరకప్రాప్తిని చెప్పియున్నాడు"- అని ఈ విమర్శకుడు వ్యాసమహర్షి అన్యాయముగానే భారతమును వ్రాశాడనటానికి మరొక ఋజువును చూపుతున్నాడు. ఇదెంతవరకు నిలబడుతుందో చూద్దాం.

"మహాభారతాన్ని అన్యాయంగా వ్రాసినందుకు చింతించి భాగవతాన్ని రచించాడు వ్యాసుడు" - అని విమర్శించిన ఈ విమర్శకుడే "భాగవతాన్ని రచించినా మనసు ఇంకా బాధించుట చేత ప్రాయశ్చిత్తం కొరకు కాబోలు మహాభారత స్వర్గారోహణ పర్వంలో దుర్యోధనునకు స్వర్గప్రాప్తిని, పాండవులకు నరక ప్రాప్తిని చెప్పియున్నాడు" అని అంటున్నారు. ఎలాగైనా విమర్శించటం, వ్యాసుని నిందించటమే తన కర్తవ్యం- అని భావించిన ఈ విమర్శకుని బుద్ధి ఎలా పనిచేస్తున్నదో చూడండి. దుర్యోధన స్వర్గ ప్రాప్తి, పాండవ నరక ప్రాప్తి గల స్వర్గారోహణ పర్వం మహాభారతంలోనిదే. ఈ మహాభారతాన్ని వ్రాసిన వ్యాసుడు తరువాత భాగవతాన్ని వ్రాశాడు. భాగవతాన్ని వ్రాసినా మనసు బాధించుట చేత తిరిగి మహాభారతాన్ని వ్రాశాడట. అంటే రెండు భారతాలు వ్రాశాడా? లేక మొదటి భారతంలోని తప్పులు దిద్దుతూ రెండవ దాన్ని వ్రాశాడా? లేక మొదట స్వర్గారోహణ పర్వం లేకుండా వ్రాసి, రెండవసారి స్వర్గారోహణ పర్వాన్ని కలిపాడా? లేక మొదటి దానిలో ధర్మజునికి స్వర్గప్రాప్తిని, దుర్యోధనునకు నరకప్రాప్తిని చెప్పి, అబ్బే అలా కాదు ఇలా చెప్పాలి అని దుర్యోధనునికి స్వర్గప్రాప్తిని, పాండవులకు నరకప్రాప్తిని చెప్పాడా? పాండిత్యం ఉన్నది గదా అని ఇలా స్వవచన వ్యాఘాతాలకు పాల్పడితే, దీనిని చదివిన పాఠకులు నవ్వుతారనిగాని; తమ దుష్టస్వభావం, దుర్బుద్ధి అస్తవ్యస్త మనస్థితి, బుద్ధిహీనత బయటపడి పోతుందనిగాని ఆలోచించలేకపోవటం వీరి రాటుదేలిన దుర్మార్గానికి పరాకాష్ట.

స్వర్గారోహణ పర్వంలో దుర్యోధనునకు స్వర్గప్రాప్తి, పాండవులకు నరకప్రాప్తి చెప్పినది యదార్థం అయితే ఎందుకలా చెప్పారో 5 అధ్యాయాల స్వర్గారోహణ పర్వంలో మొదటి 3 అధ్యాయాలను అధ్యయనం చేస్తే, మనకు తెలియవలసిన ఎన్నో విషయాలు తెలుస్తాయి. అవేమిటో చూద్దాం.

మనుష్యదేహంతో స్వర్గానికి వెళ్ళాడు ధర్మరాజు. అక్కడ దేవతల చేత పరివేష్టించబడి, సూర్యతేజస్సుతో వెలిగిపోతూ, దివ్యసింహాసనారూఢుడైన దుర్యోధనుని చూచాడు. అంత ధర్మరాజు, "ఓ దేవతలారా! ఎవరి వల్ల అరణ్య, అజ్ఞాతవాస క్లేశాలను అనుభవించామో; ఎవరివల్ల ధర్మపరాయణత, పతివ్రత ఐన ద్రౌపది మహాసభకు ఈడ్వబడి, గురుజనుల సమక్షంలో ఘోరాతిఘోరంగా అవమానించబడినదో; ఎవరివల్ల రణరంగంలో మా పుత్ర, మిత్ర, బాంధవులను పోగొట్టుకున్నామో- అట్టి దుర్యోధనుని ముఖమును చూడజాలను. నా తమ్ములెక్కడ ఉన్నారో నేను అక్కడికే వెళ్ళాలనుకుంటున్నాను" అన్నాడు. దానికి నారదుడు "యుధిష్ఠిరా! నీవలా అనకూడదు. ఈ దుర్యోధనుడు ఇక్కడ దేవతల చేత పూజించబడుతున్నాడు. ఇతడు యుద్ధ రంగంలో భయంకరమైన సమయంలో కూడా నిర్భయుడై, క్షత్రియ ధర్మాన్ని అనుసరించి, లోకభీకరరీతిలో యుద్ధం చేసి వీరమరణం చెందాడు. అందువల్ల శరీరాన్ని విడచి వీరస్వర్గాన్ని అలంకరించాడు. ఇతడే కాదు ఈ స్వర్గవాసులందరూ యుద్ధరంగంలో వీరమరణం చెంది ఇక్కడకు చేరినవారే. జూదంలో గాని, ద్రౌపదీ విషయంలో గాని, మరెప్పుడైనా గాని మీ సోదర బాంధవులకు ఏ ఏ కష్టాలు కలిగాయో వాటిని ఇక్కడ తలచుకోవటం తగదు. ఇది స్వర్గలోకం. ఇక్కడ పూర్వపు విరోధాలు గాని, శతృత్వాలు గాని ఏవీ ఉండవు" అన్నాడు.

(18-1-3 నుండి 19 శ్లో)

అప్పుడు ధర్మరాజు సోదరులను, ద్రౌపదిని, కర్ణుని, ఇతర బంధువులను చూడగోరి దేవదూతను అనుసరించి వెళుతుండగా నరకయాతనలను అనుభవిస్తున్న వారి ఆక్రందనలు వినబడినవి. దారి రక్తమాంసాలతో కూడి ఉన్నది. ఆ ప్రదేశం అంతా చీకటిగాను, దుర్గంధభూయిష్టమై అసహ్యకరమైనదిగాను ఉన్నది. దారి కూడా సరిగ్గా కనిపించటం లేదు. అక్కడ అనేకులు నరకయాతనలు అనుభవిస్తూ, ఆక్రందనలు చేస్తూ, ధర్మరాజుతో "ప్రభూ! మీరిక్కడ ఇంకొంచెం సేపు ఉండండి. మాకు ఈ నరక యాతనల నుండి ఉపశమనం కలుగుతుంది" అంటున్నారు. ఆ చీకటిలో వారెవరో గుర్తించలేని ధర్మరాజు వారితో "మీరెవరు? ఎందుకిక్కడ ఉన్నారు?" అన్నాడు. ఆ మాటతో నాలుగువైపుల నుండి "ప్రభూ! నేను కర్ణుణ్ణి, నేను భీమసేనుణ్ణి, నేను అర్జునుణ్ణి, నేను నకులుణ్ణి, నేను సహదేవుణ్ణి, నేను దృష్టద్యుమ్నుణ్ణి, నేను ద్రౌపదిని, మేము ద్రౌపదేయులము" అని నాలుగువైపులనుండి తమతమ పేర్లను తెలియజేశారు.

(18-2-16 నుండి 41 శ్లో)

అప్పుడు దుఃఖితుడైన ధర్మరాజు, "ఈ దుర్యోధనుడు ఏ పుణ్యకర్మలను చేసి పాపాత్ములైన తన అనుచరులతో కలిసి స్వర్గ సౌఖ్యాలను అనుభవిస్తున్నాడు? నా సోదరులు ఏ కర్మల ఫలితంగా ఈ నరకయాతనలను అనుభవిస్తున్నారు? వీరు ధర్మం

తెలిసినవారు, సత్యవాదులు, శాస్త్ర విధిని అనుసరించేవారు, క్షత్రియ ధర్మాన్ని అనుసరించి అనేక యజ్ఞాలు చేశారు, దక్షిణలు సమర్పించారు, యుద్ధరంగంలో ధైర్య సాహసాలతో పోరాడిన శూరవీరులు, ఐనప్పటికీ ఎందుకు వీరికీ దుర్గతి?" అని క్రుద్ధుడై ధర్మాన్ని గర్హించి, దేవతలను గర్హించి, చీకాకు పడుతుండగా అక్కడికి ధర్మదేవత, ఇంద్రుడు సపరివారసమేతంగా విచ్చేశారు. ఆ క్షణంలోనే అక్కడి నరక దృశ్యాలు, ఆక్రందనలు అన్నీ అదృశ్యమైపోయినవి. అప్పుడు సుగంధ సువాసనలతో కూడిన చల్లని గాలులు వీచినవి. ఇంద్రునితో గూడి మరుద్గణములు, అష్టవసువులు, అశ్వనీ కుమారులు, ఆదిత్యులు, రుద్రులు, సిద్ధులు, సాధ్యులు, మహర్షులు కూడా ధర్మజుని వద్దకు వచ్చారు.

(18-2-42 నుండి 54 శ్లో)

అందరి సమక్షంలో దేవేంద్రుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు- "ధర్మనందనా! నీకు అక్షయలోకాలు ప్రాప్తించినవి. ఇంతవరకు ఏమి జరిగిందో అది అలా జరగవలసినదే. రాజుల కందరకూ నరకదర్శనం తప్పదు. పాపాత్ముడైన శత్రువుకు స్వర్గమూ, ధర్మాత్ములైన సోదరులకు నరకమా? అని చింతించ వద్దు. ప్రతి వ్యక్తికీ పుణ్యరాశి, పాపరాశి రెండూ ఉంటాయి. పుణ్యఫలంగా లభించే స్వర్గభోగాలను ముందుగా అనుభవించిన జీవుడు తరువాత పాపఫలంగా వచ్చే నరకయాతనలను అనుభవించాలి. పుణ్యపాపాలలో ఏది తక్కువగా ఉంటుందో అది ముందుగా అనుభవానికి వస్తుంది. ఏది ఎక్కువగా ఉంటుందో దాని ఫలం తరువాత అనుభవానికి వస్తుంది. నీవు అశ్వత్థామ విషయంలో ద్రోణునకు చెప్పునపుడు 'హతః కుంజర' అని ఏనుగు శబ్దాన్ని పలికినా, అశ్వత్థామయే చనిపోయాడని ద్రోణుడు భావించాలని అనుకున్నావు గదా! అందుచేత నీకు కూడా ఇది నరకమే అనునట్లు నీకు ప్రదర్శింపబడింది. ఇలా ప్రదర్శింపబడినది నిజంగా నరకం కాదు. అలా నీవు భావించే టట్లు భ్రమ కలిగించటం జరిగింది. నీకు ఎలా ప్రదర్శింప బడిందో అలాగే నీ సోదరులు భీమ, అర్జున, నకుల, సహదేవు లకు, ద్రౌపదికీ భ్రమకలిగించటం జరిగింది. వారంతా పాప విముక్తులయ్యారు. చూడు వారందరిని. నీవు చేసిన రాజసూయ, అశ్వమేధాది యజ్ఞముల ఫలితంగా, తపస్సులు, దానాలు, పుణ్యకర్మల ఫలితంగా దేవ గంధర్వలోకాలలో అనేక సుఖ భోగాలు అనుభవిస్తావు. హరిశ్చంద్రుడు, మాంధాత, భగీరథుడు, దుష్యంతుని పుత్రుడు భరతుడు మొ॥న మహాత్ముల లోకాలకు పైన గల ఉన్నత లోకాలలో విహరిస్తూ దివ్యభోగాలను అనుభవించెదవు" అన్నాడు దేవేంద్రుడు.

(18-3-10 నుండి 29 శ్లో)

ఆ తరువాత ధర్మదేవత "ఓ మహనీయా! నేను ఇంత వరకు 3 సార్లు నిన్ను పరీక్షించాను. అన్ని సందర్భాలలోను నీవు ధర్మానికే కట్టుబడి ఉన్నావు. నీ సోదరులు గాని, ద్రౌపది గాని నరకమునను భవింపదగినవారు కాదు. రాజులకు నరక దర్శనము తప్పదు గనుక, నీవు 2 ఘడియల (ముహూర్త)కాలం దుఃఖాన్ని పొందావు. నీ సోదరులు, ద్రౌపది ఏ నరకానుభవాన్ని పొందటం చూచావో అది అంతా ఇంద్రునిచే కల్పించబడినదే" అని ధర్మరాజుతో చెప్పి, ముల్లోకాలను పావనం చేయు ఈ పవిత్ర ఆకాశగంగలో స్నానం చేయుమనగా, ధర్మరాజు అలాగే చేసి మానుష దేహాన్ని విడిచి దివ్యదేహాన్ని ధరించాడు. దానితో పూర్వవైరభావాన్ని విడిచి, దేవతలతో కలిసి భోగాలనుభవిస్తూ ఆనందంగా ఉన్నాడు.

(18-3-30 నుండి 44 శ్లో)

ఇంతవరకు తెలియజేసిన గ్రంథ విషయాలను బట్టి దుర్యోధనునకు లభించిన స్వర్గం యుద్ధంలో వీరమరణం చెందటం వల్ల వచ్చినదేనని; అది స్వల్పకాలం మాత్రమే అను భవనీయమని; ఆ తరువాత అతడు చేసిన పాపముల ఫలితంగా చాలాకాలం నరకయాతనలను అనుభవించవలసి ఉన్నదని; అలాగే ధర్మరాజు ద్రోణవధ సమయంలో ఆడిన ఒకే ఒక్క అబద్ధానికి గాను నరకదర్శనం చేయబడినదని స్పష్టమైనది. అంతేగాక స్వల్ప పాపం వల్ల పాండవులు క్షణకాలం నరక దర్శనం చేశారని, ఇక చిరకాలము పుణ్యఫలాలనుభవముగా స్వర్గసౌఖ్యాలు అనుభవించగలరని కూడా స్పష్టమైనది. దీనిని బట్టి దుర్యోధనునికి స్వర్గం చెప్పటం వల్ల అతడు పుణ్యాత్ముడని భావించరాదు. అతడిలాగా పాపకార్యాలు, దుర్మార్గాలు చేస్తే స్వర్గభోగాలు లభిస్తాయని ఆశపడరాదు. స్వల్ప ఫలాన్ని ముందు, అధిక ఫలాన్ని తరువాత అనుభవించాలి గనుక దీర్ఘకాల నరకానుభవం దుర్యోధనునకు ముందున్నదని గ్రహించాలి. అలాగే క్షణకాలం మాత్రం ముందుగా నరకదర్శనం చేసిన పాండవులు అన్యాయవర్తనులు కాదని, వారు పుణ్యాత్ములేనని గ్రహించాలి. దీనితో విమర్శకుని అతితెలివి ఏపాటిదో గ్రహించి, పాపభీతులై మానవులందరూ ధర్మమార్గాన నడుచుకోవటం తమవిధి అని తెలుసుకోవాలి.

**వ్యాసుడు నిందార్హుడు కాదని, పైగా సర్వజ్ఞుడని, త్రికాల జ్ఞానియని, విశేషప్రజ్ఞాదురంధరుడని, అఘటన ఘటనా పటీయసియని తెలిపే ఆశ్రమవాసపర్వ గాథతో వ్యాసుని మహిమ ఎట్టిదో, అల్పబుద్ధులు ఆయననెందుకు నిందిస్తారో తెలుసుకుందాం.** **(వచ్చే సంచికలో)**



# మహాభారతం 5

## వ్యాసుని ఘనత

రచన:
మహాభారత పరిశోధకులు
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.,(Ag)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్ : 08647 254716.

(గత సంచిక తరువాయి)

### వ్యాసమహర్షి మహిమ

నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు మహాభారత ఇతిహాసాన్ని సంపూర్ణంగా వినిపించిన సూతమహర్షి, స్వర్గారోహణ పర్వ అంతమునందు మహాభారత మహిమను, వ్యాసమహర్షి యొక్క ఘనతను ఈ విధంగా తెలిపాడు.

శౌనక మహర్షీ! ఈ ఇతిహాసము పుణ్యమైనది, పవిత్రమైనది, సర్వోత్తమమైనది. అట్టి ఈ గ్రంథమును సత్యవాది, సర్వజ్ఞుడు, విధిజ్ఞుడు, ధర్మస్వరూపుడు, పరమజ్ఞానస్వరూపుడు, అతీంద్రియ విషయ విజ్ఞానఖని, శుచివంతుడు, ధీమంతుడు, తపోధనుడు, ఐశ్వర్యోపేతుడు, సాఖ్యయోగ నిరూఢుడు, నానాతంత్ర నిష్ణాతుడు, మహాప్రభావ సంపన్నుడు ఐన వేదవ్యాసమహర్షిచే దివ్యదృష్టితో చూడబడి, మహాత్ములైన పాండవుల యొక్క; బల-వీర్య-తేజో సంపన్నులైన అన్యక్షత్రియ వీరులయొక్క కీర్తిని లోకమునందు ప్రకటింపజేయదలచి ఈ గొప్ప ఇతిహాసము నిర్మింపబడినది- అని.

దీనిని బట్టి వ్యాసమహర్షి యొక్క ఘనత ఎట్టిదో మనకు తెలుస్తున్నది. అంతేకాదు వ్యాసమహర్షి తన అనన్య సామాన్య తపోశక్తితో ధృతరాష్ట్రాదులకు యుద్ధమృతులను చూపుటయే గాక, వారితో పరస్పర సంభాషణాదుల జరిపించిన ఆశ్రమవాస పర్వగాథతో, ఆయన అఘటన ఘటనా పటీయసియని, ఆ సమయంలో పుట్టంధుడైన ధృతరాష్ట్రునకు దృష్టిననుగ్రహించిన మహర్షి సాక్షాత్తు భగవానుడేనని ఋజువౌతుంది. అందుకే భగవద్గీతలో భగవానుడు, 'మునీనామప్యహంవ్యాసః'- నేను మునులలో వ్యాసుడను- అని చెప్పటం జరిగింది. ఇపుడా ఆశ్రమవాస పర్వమందలి ఒడలు గగుర్పొడిచే ఆ గాథ ఏమిటో చూద్దాం.

### ధృతరాష్ట్రాదులకు యుద్ధ మృతుల జూపుట

(ఆశ్రమవాస పర్వం 1-2-3అ)

మహాభారత యుద్ధానంతరము తమ నూరుగురు పుత్రులను కోల్పోయిన ధృతరాష్ట్రుడు, గాంధారితో సహా 13 సంవత్సరములు పాండవుల పంచన గడిపి, ధర్మరాజాదులను సమ్మతింపజేసి తపస్సుకై అరణ్యమున ప్రవేశించాడు. గాంధారీ, కుంతీదేవి సపర్యలు చేస్తుండగా, విదుర సంజయులతో కూడి వనవాసము చేస్తున్నాడు. ఆ సందర్భంలో ఒకసారి ధర్మరాజాదులు సపరివారంగా సేనలతోను, అంతఃపుర స్త్రీలతోను కుంతీదేవిని, గాంధారీ ధృతరాష్ట్రులను పరామర్శించుటకై వచ్చి, కొన్ని దినములు అక్కడే ఉన్నారు. ఆ సమయంలో వ్యాసమహర్షి ధృతరాష్ట్రుని ఆశ్రమానికి విచ్చేశాడు.

వ్యాసమహర్షి ధృతరాష్ట్రుని అనేక కుశల ప్రశ్నలు వేసి, నాయనా! నీ తపస్సు బాగా జరుగుతున్నది గదా! పుత్రదుఃఖమును మరచితివా? నేను నీ సంశయ విచ్ఛేదము చేయుటకే వచ్చితినని తెలుసుకో. ఇదివరలో లోకమునందు ఏ మహర్షుల చేతను చేయబడనిది ఏది కలదో, అట్టి ఆశ్చర్యకర విషయమును నా తపఃఫలముగా మీకు చూపగలను. నీవు దేని యొక్క దర్శనమును, స్పర్శనమును, శ్రవణమును అపేక్షిస్తావో అట్టి నీ కోరికను నీకు ఘటింపజేస్తాను. మీరందరు ఇక్కడ కూడిన విషయాన్ని తెలుసుకొనియే, మీ సంశయ విచ్ఛేదనార్థం ఇక్కడకు

వచ్చాను. దేవతలు, గంధర్వులు, ఈ మహర్షులు చిరకాలం నుండి నేను చేసిన తపస్సు కారణంగా ఆర్జించిన శక్తిని చూచెదరు గాక! నీకోరిక ఈడేర్చెదను. వరం కోరుకో. నా తపోబలాన్ని చూడు - అన్నాడు వ్యాసుడు.

మహర్షి ఇలా అనటంతో రెండు ఘడియలు ఆలోచించిన ధృతరాష్ట్రుడు, మహాత్మా! మహనీయులైన మీరందరు విచ్చే యుట చేత నేను ధన్యుడనయ్యాను. కాని దుర్బుద్ధి, మందమతి ఐన దుర్యోధనుని కారణంగా, వాడు చేసిన అన్యాయాల కారణంగా, పోగొట్టుకున్న నా పుత్రులందరినీ తలచుకొని, పుత్రప్రేమ గల నా మనస్సు నిత్యము ఖేదపడుతూనే ఉన్నది. ఏ పాపము ఎరుగని పాండవులు అతనిచేత మోసగించబడి, అనేక క్లేశాలు అనుభవించారు. ఏనుగులు, గుర్రాలు, మనుష్యులతో కూడిన ఈ భూమి అంతా వీరుల నాశనంతో బేల అయినది. ఎందరో రాజులు, మహావీరులు నా పుత్రుని పక్షమున వచ్చి, భార్యాబిడ్డలను విడిచి ప్రాణాలు కోల్పోయారు. మిత్ర కార్యార్థమై వచ్చి యుద్ధములో మరణించిన ఆ మహారాజులకును, నా పుత్ర పౌత్రాదులకును ఎట్టి గతి సంభవించినదోయని, రాత్రింబవళ్ళు చింతిస్తున్న నా మనస్సుకు శాంతి లేదు- అని చెబుతుండగా, వింటున్న గాంధారికి, కుంతీదేవికి, ద్రౌపదికి, సుభద్రకు, దుర్యోధనాదుల భార్యలందరికీ యుద్ధములో మరణించిన తమ వారిని గురించిన శోకము రేగినది. అప్పుడు భర్త అంధుడగుట చేత తాను కూడా కన్నులకు గుడ్డకట్టుకొని యున్న గాంధారి లేచి, వ్యాసమహర్షికి చేతులు జోడించి నమస్కరించి, మహర్షితో ఇలా అంటున్నది-

మునీంద్రా! మరణించిన పుత్రులను గూర్చి శోకించుచున్న ఈ మహారాజుకు, ఇప్పటికి పదహారు సంవత్సరములు గడచిన ప్పటికీ శాంతి కలుగలేదు. పుత్రశోకంతో నిట్టూర్పులు విడుస్తూ రాత్రుళ్ళు నిదురించుట కూడా లేదు. నీవు తపో బలమున లోకాంతరములను గూడా సృష్టించ సమర్థుడవు. లోకాంతర గతులైన పుత్రులను మహారాజుకు చూపలేవా? నా కోడండ్రందరిలోనూ ఉత్తమురాలైన ఈ ద్రుపద రాజకుమారి ద్రౌపది- యుద్ధంలో తన తండ్రిని, పినతండ్రులను, సోదరులను, పుత్రులను, బంధువులను కోల్పోయి అత్యంత శోకసాగరంలో మునిగి ఉన్నది. ఇదిగో! ఈ శ్రీకృష్ణ సోదరి సుభద్ర తన ప్రియపుత్రుడు అభిమన్యుని వధను తలచుకొని నిరంతరం శోకిస్తూనే ఉన్నది. కురుప్రముఖులు బాహ్లీక, సోమదత్త, భూరిశ్రవులు ముగ్గురూ యుద్ధంలో హతులయ్యారు. వారు ఏ లోకాలకు చేరారో అని నా మనస్సు మధనపడుతున్నది. మరణించిన నా వందమంది పుత్రుల యొక్క ఈ వందమంది భార్యలు దుఃఖాక్రాంతులై యున్నారు. ఈ మహారాజు, నేనూ నీ అనుగ్రహంతో శోకాన్ని విడిచి కాలం గడపాలి- అనగా, కుంతీదేవి కర్ణుని గురించిన తన దుఃఖాన్ని వెల్లడించింది. అంతట వ్యాసమహర్షి గాంధారితో -

గాంధారీ! ఈ రోజు రాత్రి నీవు నీ పుత్రులను, సోదరులను, వారి మిత్రులను, ఆత్మీయులను చూచెదవు. నీ కోడండ్రందరు వారి వారి పతులతో గూడి నిద్రించిలేచిన వారిని వలె చూడగలవు. కుంతీ, ద్రౌపదీ, సుభద్రలు కూడా వారి వారి ఆత్మీయులను, పుత్రులను, సోదరులను, తండ్రులను చూడగలరు. యుద్ధ మృతులకు ఏఏ దుర్గతులు కలిగినవోయని చిరకాలము నుండి పరితపించుచున్న మీ చింతలన్నింటిని తొలగించెదను. ఇప్పుడు మీరందరు గంగానది యొద్దకు వెళ్ళి ఉండండి. అక్కడ మీరు సమరభూమిలో మరణించిన మీ మీ ఆత్మీయుల నెల్ల చూడగలరు - అన్నాడు.

ఇలా వ్యాసుడు చెప్పటంతో అందరు, సింహనాదాలు చేస్తూ గంగానది వైపుకు బయలుదేరారు. సాగరంలాగా జనసమూహం క్రమంగా గంగానదిని చేరి, ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుండగా సాయంకాలమైంది. సాయంకాల కృత్యములు నెరవేర్చుకుని, వారందరు అక్కడకు వచ్చిన వ్యాసమహర్షిని చేరగా, వ్యాసమహర్షి రాత్రికాగానే గంగానదిలో ప్రవేశించి, యుద్ధమృతులైన రాజులను, రాజపుత్రులను, ఇతర వీరులను ఆవాహన చేయగా, ఆ గంగాజలమునుండి కురుపాండవ సేనల కలకలధ్వని వినిపించినది. తరువాత భీష్మద్రోణాదులు సైన్యములతో, వేలకొలదిగా వీరులతో ఆ జలము నుండి పైకి వస్తున్నారు. అందులో ఏ వీరునిది ఏ వేషమో, ఏ ధ్వజమో, ఏ వాహనమో, ఏ కవచమో, ఏ ఆయుధమో వాటితోనే ఆ వీరుడు కనిపిస్తూ ఉన్నాడు. అందరూ దివ్యాంబరధరులు, కుండలాలు ధరించి ఉన్నారు, నిరహంకారులై, పూర్వవైరం లేని వారై యున్నారు. అప్పుడు వ్యాసభగవానుడు ధృతరాష్ట్రునకు దివ్యదృష్టిని ప్రసాదించాడు. శరీరానికి గగుర్పాటు కలిగించే, ఊహించటానికి వీలులేని, ఆ అత్యద్భుత దృశ్యాన్ని జనులు విస్మితులై రెప్పపాటు లేకుండా చూస్తున్నారు. వ్యాసమహర్షి యొక్క అనుగ్రహంతో పొందిన దివ్యనేత్రాలతో ధృతరాష్ట్రుడు

తనపుత్రులందరిని, ఇతర బంధువర్గాన్ని కన్నులారా చూస్తూ ఆనందసాగరంలో మునిగిపోయాడు. వారందరూ క్రోధాన్ని, అసూయను విడిచి, పాపరహితులై, ఒకరితో ఒకరు ప్రేమ పూర్వకంగా కలిసి మెలిసి యున్నారు. పూర్వపు శత్రుత్వం వారిలో లేశమాత్రం కూడా లేదు. దేవలోకంలోని దేవతలవలె అందరూ హర్షోల్లాసాలతో ఉన్నారు. పుత్రులు తల్లిదండ్రులను, స్త్రీలు తమ పతులను, సోదరులు సోదరులను, మిత్రులు మిత్రులను కలుసుకొని ఆశ్చర్యానందాలలో మునిగితేలు తున్నారు. మహావీరుడు కర్ణుడు అభిమన్యుని, ద్రౌపదేయులను సంతోషంతో కలుసుకున్నాడు. పాండుపుత్రులైదుగురు సంతోషం తో కర్ణుని కలుసుకొని సౌహార్ధముతో ప్రసంగించారు.

సమస్త యోధులు పరస్పరం కలుసుకొని ప్రసన్నులయ్యారు. వ్యాసమహర్షి యొక్క అఖండ తపోబలం వల్ల క్షత్రియులందరు క్రోధాన్ని, శతృత్వాన్ని వీడి పరస్పరం కలిసి మెలసి సంభాషించు కున్నారు. ఈ విధంగా కురువంశ ప్రముఖులు, ఇతర రాజులు, అంతా గురుజనులు, పుత్రులు, మిత్రులు, బాంధవులందరితో గలసి ప్రీతితో ఆ రాత్రియంతయు యధేచ్ఛగా విహరించారు. స్త్రీలందరూ తమతమ పతులతో కలిసి తిరుగుతూ, ఆయా ప్రాంతాల్లో విహరిస్తూ స్వర్గవాసులవలె పరమానందాన్ని పొందారు. అక్కడికి వచ్చిన స్త్రీలందరూ తమ తండ్రులతోను, సోదరులతోను, భర్తలతోను, పుత్రులతోను కలిసి మెలిసి తిరుగుతూ, సంభాషించుకుంటూ తమ మనస్సులలో ఉన్న శోకాన్ని దూరం చేసుకున్నారు. ఆ వీరులందరూ తమ తమ భార్యలతో కూడి ఆ రాత్రి అంతా కలిసిమెలిసి విహరించి, చివరకు తమవారి అనుమతితో, ఎలాగ జలం నుండి వచ్చారో అలాగే వెళ్ళిపోవటానికి, ఉద్యుక్తులయ్యారు. అప్పుడు వ్యాస మహర్షి విడిచిపెట్టటంతో వచ్చిన వారందరూ ఒక్కక్షణంలో చూస్తూ చూస్తూ ఉండగానే పవిత్ర గంగా జలాలలో మునిగి అదృశ్యులయ్యారు. రథాలతోను, ధ్వజాలతోను కూడి వారి వారి లోకాలకు వెళ్ళిపోయారు. కొందరు దేవలోకానికి, కొందరు బ్రహ్మలోకానికి, కొందరు వరుణలోకానికి, కొందరు కుబేర లోకానికి, కొందరు సూర్యలోకానికి వెళ్ళగా కొందరు రాక్షసలోకానికి, మరికొందరు పిశాచలోకానికి వెళ్ళారు.

వారందరూ అంతర్ధానమైన తరువాత, వ్యాసమహర్షి గంగా జలంలో నిలిచి, యుద్ధంలో మరణించిన వీరుల యొక్క భార్యలను గూర్చి ఇలా అన్నాడు, "ఏయే పతివ్రతలు తమ పతిలోకాన్ని చేరి తమ పతులతో కలిసి ఉండాలనుకుంటారో వారందరూ ఈ గంగాజలంలో వెంటనే మునగండి" అని. ఆ మాటతో పతిలోకాన్ని కోరిన ధృతరాష్ట్రుని కోడండ్రు, మరి కొందరు స్త్రీలు ధృతరాష్ట్రుని అనుమతి తీసుకొని, ఆ గంగా జలంలో కలిసి మనుష్యదేహాలను విడిచి తమ తమ పతుల లోకాన్ని చేరుకున్నారు.

యుద్ధంలో మరణించిన రాజులయొక్క ఈ పునరాగమన వృత్తాంతాన్ని విన్న వివిధ రాజ్యాలలోని ప్రజలు ఆశ్యర్యానందా లలో మునిగితేలారు- అని సూతుడు శౌనకాది మహామునులకు చెప్పి, ఈ కౌరవపాండవ ప్రియజన సమాగమ వృత్తాంతాన్ని శ్రద్ధగా ఎవరు వింటారో వారికి ఇహలోక, పరలోకాలలో ఇష్టవస్తు ప్రాప్తి కలుగుతుందని ఫలశ్రుతిని కూడా చెప్పటం జరిగింది.

ఈ ఆశ్చర్యకరమైన వృత్తాంతాన్ని వైశంపాయనుడు చెబుతుండగా వింటున్న జనమేజయుడు, శరీర పరిత్యాగాన్ని చేసిన వారు తిరిగి అదే రూపంతో, అదే శరీరంతో దర్శన మివ్వటం ఎలా సాధ్యపడుతుంది? వరదుడైన వ్యాస మహర్షి నాకు కూడా నా తండ్రిని అదే రూప, వేష, వయస్సులతో చూపినట్లైన మీరు చెప్పిన ఈ వృత్తాంతాన్ని విశ్వసించ గలుగు తాను. దీనితో నాకు అత్యంత ప్రీతికరమైన కార్యము సిద్ధిస్తుంది. మునిశ్రేష్ఠుని కరుణాకటాక్షంతో నా కోరిక నెరవేరు గాక! అని వైశంపాయనునితో తన సందేహాన్ని, తన వాంఛితాన్ని వ్యక్తపరిచాడు.

జనమేజయుడిలా అడగటంతో వ్యాసమహర్షి ప్రత్యక్షమై, మరణించిన పరీక్షిత్తును ఆ యజ్ఞవాటికకు ఆవాహన చేశాడు. పరీక్షిత్తు స్వర్గం నుండి అదే రూపంతో, అదే వయస్సుతో రాగా తేజోవంతుడైన తన తండ్రిని జనమేజయుడు ఆశ్చర్యంతో చూచాడు. పరీక్షిత్తుతో బాటు శమీక మహర్షి, శృంగి, మరియు పరీక్షిన్మహారాజు యొక్క మంత్రి కూడా ఉన్నారు. దానితో జనమేజయుడు హర్షపులకిత గాత్రుడై యజ్ఞావసాన సమయమున చేయవలసిన అవబృథ స్నానం తండ్రి సమక్షంలోనే చేసి, యజ్ఞాన్ని ముగించగా పరీక్షిత్తు అదృశ్యమయ్యాడు.

ఈ ఆశ్రమవాస పర్వంలోని వృత్తాంతం వల్ల వ్యాసమహర్షి యొక్క అనితర సాధారణ తపః ప్రభావం ఎట్టిదో తెలుస్తున్నది. యోగబలము, తపశ్శక్తి, దివ్యదృష్టి - అనే పరికరాలతో; దేశాంతర, కాలాంతర, లోకాంతర వస్తు సాక్షాత్కారంతో; వివిధ

వేదార్థ పరిష్కరణంతో; యదార్థమైన ఇతివృత్తంతో; లోక కళ్యాణ కాంక్షతో, ఆయా వ్యక్తుల హృదయగతమైన విషయాలతో రచించబడినది ఈ మహాభారత ఇతిహాసం. ఇట్టి పరమ పవిత్రమైన గ్రంథాన్ని లోకానికి ప్రసాదించిన వ్యాస భగవానుని ఘనత ఎట్టిదో స్మరించుకుందాం.

## వ్యాసమహర్షి ఘనత

వ్యాసమహర్షి తొలుత వేదవిభాగం చేశాడు. బ్రహ్మ సూత్రాలను రచించాడు, అష్టాదశ మహా పురాణాలను అందించాడు. మహాభారత ఇతిహాసాన్ని ప్రసాదించాడు. ఉపనిషత్సారమైన భగవద్గీతను, విష్ణుసహస్రనామాలను, శివసహస్రనామాలను మహాభారత అంతర్భాగముగ అందించాడు. తన అసాధారణ తపః ప్రభావం చేత ధృతరాష్ట్రాదులకు యుద్ధ మృతులను చూపుటయే గాక వారితో పరస్పర సంభాషణా దులను జరిపించాడు. జాత్యంధుడైన ధృతరాష్ట్రునికి దృష్టిని అనుగ్రహించాడు. సంజయునకు కురుక్షేత్ర యుద్ధమునందలి యావద్విశేషాలు కరతలామలకమగునట్లు దివ్యదృష్టిని ప్రసాదించాడు. సందేహించిన జనమేజయుని కోర్కె దీర్చుటకై పరీక్షిత్తును చూపించాడు. గాంధారికి వందమంది పుత్రులు కలుగునట్లు వరమిచ్చాడు. గాంధారీ గర్భతాడనంతో బయటపడిన అతి కఠినమైన మాంసపు ముద్దను అంగుష్ఠ ప్రమాణమైన ముక్కలుగా ఖండించి, వాటిని నేతికుండల యందుంచి, శీతల జలాలతో తడపమని చెప్పి, దుర్యోధనాదులు నూరుగురిని, మరియు దుస్సలను ఉత్పాదింపజేశాడు. అవసర సమయాలలో కుంతీదేవికి, పాండవులకు, ధృతరాష్ట్రునికి, గాంధారికి ఎప్పటికప్పుడు తన యోగశక్తితో ప్రత్యక్షమవుతూ తగిన సలహాలనిస్తూ వచ్చాడు. ఆ జన్మసిద్ధుడై, బ్రహ్మర్షియై, విష్ణ్వంశసంభూతుడై, త్రికాల జ్ఞానియై, జీవన్ముక్తుడై, లోకోద్ధరణ దీక్షాతత్పరుడై, వేదమంత్ర విరాజితుడై, ధర్మస్వరూపుడై, వేద వేదాంత విజ్ఞాన నిధియై విలసిల్లినాడు.

ఇట్టి జగద్వంద్యుని, జగద్గురువును ఒక సాధారణ వ్యక్తిగా, ఒక సామాన్య గ్రంథకర్తగా భావించి, అధునాతనుల మనుకొనే వారు విమర్శించటం, నిందించటం, దూషించటం, ఆరోపణలు చేయటం వారి బుద్ధిహీనతకు నిదర్శనం తప్ప మరేమీ కాదు.

## సత్పురుషులను, సద్గ్రంథాలను నిందించువారి మనఃస్థితి

మహాభారతం ఆదిపర్వం 74వ అధ్యాయంలో శకుంతల దుష్యంతునితో పలికిన వచనాలలో కొన్ని ఇక్కడ చూద్దాం. గుర్తుంచుకుందాం.

"ఇతరులను నిందించి సజ్జనుడెంతగా పరితపిస్తాడో దుర్జనుడంతగా సంతోషిస్తాడు. పెద్దలకు నమస్కరించి సజ్జనులెంతగా ఆనందిస్తారో సజ్జనులను నిందించి దుర్జనుడంతగా ఆనందిస్తాడు. సత్పురుషులను దుష్టులని నిందిస్తాడు దుష్టుడు. క్రోధముగల విషసర్పమునకు భయపడినట్లు-సత్యాన్ని, ధర్మాన్ని విడిచిపెట్టిన మానవుని వల్ల నాస్తికుడు కూడా భయపడు తుంటాడు; ఇక ఆస్తికుని మాట చెప్పవలసిన దేముంది?" - అని శకుంతల పలికినది.

వేదవ్యాస భగవానుని నిందించిన వారి చర్యను చూస్తే 'సుభాషిత రత్నభాండాగారం'లోని ఒక మహాకవి సుభాషితం గుర్తు వస్తుంది. దాని భావం- "ఓ మానవుడా! చదువులేని నీవు పాండిత్యాన్ని బలాత్కారంగా సంపాదించాలనుకుంటే ఇదిగో ఉపాయం-వ్యాసాది కవిపుంగవులను పరిహాసం చేస్తూ, నిర్లక్ష్యంగా అనుచితప్రసంగాలపాలు చేయుము. కన్నులు మూసుకొని ఏవో శ్లోకములను గర్వముతో చదువు. ఇతరులు రచించిన గ్రంథాలను తిరస్కరించు. విద్వాంసులతో స్పర్థ కలిగియుండు. ఇలా చేస్తే నీకు ఏమాత్రం విద్యలేకపోయినా పండితుడవని అనిపించుకోగలవు" అని.

బహుశా ఈ ఉపాయాన్ని స్వీకరించి మహాత్ములను నిందిస్తూ, మహాభారతం వంటి గ్రంథాలను అల్పమైనవిగా చిత్రించి, ఆనందించే విమర్శకుల మాటలను- గ్రంథాలను ఆమూలా గ్రంగా తెలుసుకోవటం ద్వారాగాని, అలా తెలుసుకున్న మహాత్ముల ద్వారా విని గాని, విశ్వసించాలి తప్ప అమాయకంగా నమ్మరాదు.

**మహాభారత ఇతిహాసంలోని అనేక సంఘటనలు సరిగ్గా అవగాహన చేసుకొనలేని వారి వల్ల, కవుల కల్పనల వల్ల, ఎన్నో అపోహలకు అపార్థాలకు దారితీసినవి. ఎన్నో అంతరార్థాలతో వ్రాసిన విషయాలను బుద్ధిసూక్ష్మతతో విశ్లేషణ చేసి తెలుసు కోవాల్సిందే. లేకపోతే ఎన్నో అనర్థాలు, అపార్థాలు. అలాంటి సంఘటనలలో ప్రధానమైనది ఏకలవ్య చరిత్ర. మరి ఆ చరిత్ర ఏమిటో, అందలి విశేషాలేమిటో, ధర్మసూక్ష్మాలేమిటో, ఆ చరిత్ర నుండి నేర్చుకోవలసిన జీవన సత్యాలేమిటో తెలుసుకుందాం.**

(వచ్చే సంచికలో)